క్లుప్తంగా

అభినందనలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీలో నివాసముంటూ మెరిల్ హెల్త్‌కేర్ రోబోటిక్ విభాగంలో ఉద్యోగం చేస్తున్న వడ్ల రమ్యశ్రీ నర్సాపూర్‌లోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతోంది. 2023 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు కళాశాల యాజమాన్యం ఆమెను సత్కరించింది. ఈ సందర్భంగా యాజమాన్యం వారు మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా మంచి ప్యాకేజీతో, వివిధ కంపెనీల్లో అవకాశం వచ్చినప్పటికీ, బీ ఫార్మసీ చదివినందుకు వైద్య సేవలోనే ఉద్యోగం చేయాలనే సంకల్పంతో, మెరిల్ హెల్త్ కేర్ రోబోటిక్ విభాగంలో చేరి ఉద్యోగం చేస్తున్నందున అభినందించారు. అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అల్లూరి, రవీంద్ర బాబు, లక్ష్మీప్రసాద్‌లు విద్యార్థిని రమ్యశ్రీని శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు.

అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని.. అందుకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధే నిదర్శనమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం హెచ్‌ఏఎల్ పార్కులో రూ.22 లక్షలు, భవానీనగర్‌లో రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, మేకల హరినాథ్, లలితా, ఉదయరాణి, సంతోషి పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

బాలానగర్: తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఇటీవల బెంగుళూరులో జరిగిన జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నవజీవన్‌నగర్‌కు చెందిన తేజస్‌కుమార్ మూడు బంగారు పతకాలు సాధించినందుకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ నాయుడు, ఆర్‌కె రాజు పటేల్, నవజీవన్ నగర్ కాలనీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సభ్యులు రాజ్‌కుమార్, టి. భాస్కర్‌రెడ్డి, శ్రీరామూర్తి, శర్వాణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న జూనియర్ పవన్ కళ్యాణ్, లయన్స్ క్లబ్ సభ్యులు

భాగ్యనగర్‌కాలనీ: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రకృతి నేతృత్వంలో, మాగ్నస్ డయాగ్నస్టిక్స్ వారి ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట క్రాస్ రోడ్డు వద్ద ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ లేళ్ల రవికాంత్, మాగ్నస్ సంస్థ చైర్మన్ లయన్ సింగం శ్రీనివాసరావులు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బంజరా ఎవరెస్ట్ మెగా సిటీ, జయభారత్, ప్రగతి ధరణి సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా జూనియర్ పవన్ కళ్యాణ్, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా లయన్ డి.కోటేశ్వరరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్: బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆరు రోజులుగా ఆశావర్కర్లు తమ సమస్యల పరిష్కారానికి శనివారం బతుకమ్మ ఆడి తెలంగాణ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా, చర్చలు జరపకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం కార్మిక వర్గాన్ని అణచివేసే ప్రయత్నంలో భాగంగా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుక్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు సౌభాగ్యమ్మ, అనిత, సబియా, జీనా, మౌనిక, అశ్విని, సరళ, వినోద, విజయలక్ష్మి, మౌనిక, సిద్ధిక, స్రవంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా

దుండిగల్: స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. శనివారం భౌరంపేట్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేసి చెత్తాచెదారాలను తొలగించారు.

టెన్షన్.. టెన్షన్



- ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా..
- ఎమ్మెల్యే మైనంపల్లి చేరికతో.. ఆశావహుల్లో ఆందోళన
- పార్టీ బలపడుతుందని పలువురిలో ఉత్సాహం..
- మరోవైపు అసంతృప్తులు చేజారకుండా కసరత్తు
- మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇదీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: హస్తినకు చేరిన తుది జాబితాలో తమ పేర్లు ఉన్నాయో.. లేదోనన్న ఉత్కంఠ కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో తీవ్ర టెన్షన్‌కు గురిచేస్తోంది. టికెట్ పైరవీల కోసం ఆశావహులు ఎవరూ ఢిల్లీకి రావొద్దని అధిష్టానం ఇప్పటికే నాయకులకు సంకేతాలు ఇచ్చింది. సర్వే ఆధారంగానే టికెట్లను కేటాయిస్తామని, ఈసారి పైరవీలకు ఆస్కారం లేదని, గెలుపు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేసింది. చివరి ప్రయత్నంపై ఆశలు పెట్టుకున్న నేతలకు అధిష్టానం ఢిల్లీకి రావొద్దని షాక్ ఇవ్వడంతో నిరాశే మిగులుతోంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని ఆశావహుల్లో టికెట్ వస్తుందా? లేదా? అనే సందిగ్ధత తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో.. జిల్లాపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో.. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవాన్ని నింపుతుండగా, మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తున్న ఆశావహులను మాత్రం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

తీవ్ర అసంతృప్తితో నందికంటి శ్రీధర్

సిట్టింగ్ ఎమ్మెల్యే, సీనియర్ నేత మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నప్పటికీ, ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన అనుచరులు మాత్రం మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్ నందికంటికే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం కావడంతో పార్టీకి పెద్ద తలనొప్పిగా మారిందన్న చర్చ ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

మల్కాజిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ ప్రకటించినప్పటికీ, కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తితో రాష్ట్ర మంత్రి హరీష్‌రావుపై తీవ్ర విమర్శలు చేయటంతోపాటు రాజకీయ భవిష్యత్‌పై కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు షరతులు కూడా విధించినట్లుగా జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మల్కాజిగిరి తనకు, మెదక్‌లో తనయుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో పాటు జిల్లాలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాను సూచించిన వారికి టికెట్ ఇవ్వాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే.. ఎమ్మెల్యే మైనంపల్లి పెట్టిన షరతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సిందేనన్న సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో లేకపోలేదు.

బుజ్జగించే ప్రయత్నం

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నేతల రాకతో.. పార్టీలో నెలకొన్న అసంతృప్తి వాదులను బుజ్జగించేందుకు అధిష్టానం ఆదేశాల మరకు పార్టీ పెద్దలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా నిరాశతో ఉన్న నాయకులను సంతృప్తి పరిచేందుకు పలు హామీలతో నచ్చజెబుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వారికి కట్టబెట్టనున్న పదవులు, ఇతర విషయాలను పేర్కొంటూ.. బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో కొంత నైరాశ్యం కనిపిస్తుండగా, వారితో పార్టీ పెద్దలు మంతనాలు జరుపుతుండటంతో పాటు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకునే లక్ష్యాన్ని విస్మరించకూడదన్న విషయాన్ని మాత్రం నొక్కి చెబుతున్నారని స్థానిక కేడర్ పేర్కొంటోంది.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఎల్లమ్మబండలో డెంగీ వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగీ వ్యాధి లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సును శనివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మెడికల్, ఎంటమాలజీ, ఆశావర్కర్లతో హాజరై ప్రారంభించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా డెంగీ వ్యాధి పెరుగుతుందని, ఈ సమయంలో జీహెచ్ఎంసి ఆరోగ్య శాఖ, ఎంటమాలజి సిబ్బంది సమన్వయంతో పనిచేసి డెంగీ వ్యాధి నివారణ చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఆశా వర్కర్లు ప్రజలతో మాట్లాడి అవగాహన తీసుకురావాలన్నారు. ప్రజలు కూడా బాధ్యత వహించి వారి ఇళ్లలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. చెత్తను వీధుల్లోనూ, కాలువల్లో కాకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరించే ఆటోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, డాక్టర్ మను పప్పన్, ఎంటమాలజి ఎఇ ఉషారాణి, బీఆర్‌యస్ పార్టీ నాయకులు రాములు గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజేందర్, పద్మయ్య, ఎంటమాలజి సూపర్‌వైజర్ డి. నరసింహులు, వైద్య సిబ్బంది ప్రియాంక, భవాని,లీల, బాలామణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మారథాన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

- 5కే వాకథాన్‌లో మంత్రి మల్లారెడ్డి

మూసాపేట: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్ వద్ద మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కే వాకథాన్ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరయ్యారు. కుమారుడు భద్రారెడ్డి, వైద్యులు, యువతీ యువకులతో కలిసి డ్యాన్స్ చేస్తూ వారిలో ఉత్సహం నింపారు. తాను 70 ఏళ్ల వయసులో వ్యాయామం చేస్తూ ఉత్సాహంగా ఉన్నానని తెలిపారు. నేటి యువతలో కొందరు చెడు అలవాట్లకు బానిసై ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, అటువంటి వ్యసనాలను విడనాడి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. హైదరాబాద్ నగరం ఆరోగ్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నదని అందులో భాగంగానే సైకిల్ ట్రాక్, పార్కులో వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు సుధాకర్, ఆనంద్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిల్లు పాటకు స్టెప్పులు వేసిన మంత్రి మల్లారెడ్డి

నమ్రతా శిరోద్కర్, సితార సందడి



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని నెక్సస్ మాల్‌లోని మ్యాక్స్ ఫ్యాషన్‌లో దసరా ఉత్సవాలు సందర్భంగా బొమ్మల కొలువు ప్రారంభించారు. శనివారం పాపులర్ హీరోయిన్ నమ్రతా శిరోద్కర్, ఆమె కుమార్తె సితార ఘట్టమనేని బొమ్మల కొలువును ప్రారంభించారు.దసరా ఉత్సవాలు ప్రారంభం నేపథ్యంలో వినియోగదారులను ఆకర్షించడం, లేటెస్ట్ ఫ్యాషన్ల అతి తక్కువ ధరకే లక్ష్యంగా నెల రోజుల పాటు మ్యాక్స్ వేడుకలకు నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా 150 బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ల్యాండ్ మార్క్ గ్రూప్ మ్యాక్స్ ఫ్యాషన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ హెడ్ పల్లవి పాండే, రీజినల్ బిజినెస్ హెడ్ పెద్దిరాజు, ఆనంద్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రైవేట్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ మాదిగ శనివారం నిరసన తెలిపారు. 2021 నుంచి 2023 విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేయాలన్నారు.

చిల్డ్రన్స్‌పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలి



హెచ్ఏఎల్ కార్తికేయనగర్‌లో పార్కు స్థలంలో నిర్మించిన గోడను పరిశీలిస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని హెచ్ఏఎల్ కార్తికేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సర్వే నం.133–134 పార్ట్‌లో రూ.3 కోట్ల విలువ చేసే చిల్డ్రన్స్‌పార్కు స్థలాన్ని కబ్జా బారి నుంచి కాపాడాలని శనివారం బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌రావుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, దుండిగల్ మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... చిన్నపిల్లల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కును రాత్రికి రాత్రే బీఆర్ఎస్ కబ్జా చేశాదన్నారు. పార్కు స్థలం చుట్టూ గోడలు నిర్మించారని ఆరోపించారు. వెంటనే సదరు నిర్మాణాలను కూల్చివసి క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, శ్రీనివాస్, కాలనీసభ్యులు శశికుమార్, సత్యనారాయణ, ప్రభాకర్‌రావు, ఉష, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి

నిజాంపేట్: రోడ్ల నిర్వహణ, మరమ్మతుల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల వైఖరితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల పరిస్థితిని నిరసిస్తూ ప్రగతినగర్‌లోని మూడు కోతుల బొమ్మలకు బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల్లో రోడ్ల మరమ్మతులకు రూ.5 కోట్ల నిధులు కేటాయించినా రోడ్లపై మాత్రం గుంతల అలాగే దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. నిజాంపేట్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ముందు రోడ్లను బాగు చేయాలని హితవు పలికారు. జేఎన్‌టీయూ నుంచి గ్రీన్ బావర్చి, కోకో కోల సర్కిల్, నిజాంపేట క్రాస్ రోడ్ నుంచి బాచుపల్లి మెయిన్ రోడ్డు వరకు అధ్వానంగా మారిన రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. లేని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ దాసి నాగరాజు, పార్లమెంట్ కో.కన్వీనర్ డాక్టర్ రాజు, మేడ్చల్ జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ శేషారావు, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు, కార్యవర్గ సభ్యుడు సతీష్ కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాము, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మాధవరావు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు రమేష్, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు సర్టిఫికెట్‌లను అందజేసిన కార్పొరేటర్ శిరీష

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మి సెంటర్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు లక్ష్మీరాజ్యం, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో ఆరోగ్య సంరక్షణా చర్యలను అభివృద్ధి చేయడానికి నగరంలోని లైఫ్‌స్పాన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నైజీరియాకు చెందిన రైమా ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. శనివారం జీడిమెట్లలోని లైఫ్‌స్పాన్ హాస్పిటల్ వేదికగా జరిగిన ఈ అవగాహన ఒప్పందంపై భారతదేశానికి నైజీరియా హై కమీషనర్ హిజ్ ఎక్సలెన్సీ అంబాసిడర్ అహ్మద్ సూలే అధ్యక్షత వహించారు. లైఫ్‌స్పాన్ చైర్మన్ డాక్టర్ నరేంద్రరామ్ మాట్లాడుతూ... ఈ ఒప్పందంతో నైజీరియాలో ఆరోగ్య సంరక్షణ లోటును పూడ్చడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

తొమ్మిదేళ్లలో అభివృద్ధి చేసి చూపించాం..





అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్లలో రూ.9కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ.... 60 సంవత్సరాల్లో చేయని అభివృద్ధిని 9 సంవత్సరాల్లో చేసి చూపించామని అన్నారు. దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. పాదయాత్ర సమయంలో ప్రధానంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్, రోడ్లు, డ్రైనేజీలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పండాల సతీష్‌గౌడ్, సబిహా బేగం, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, రాజశేఖర్‌రెడ్డి, జావీదొద్దీన్, మహమ్మద్ నూర్ ఖాన్, తులసి, పార్వతమ్మ, లక్ష్మీ,నజ్మా, రేణుక, మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.